క్లుప్తంగా

టీటీ జాతీయ పోటీలకు డీఎస్ఏ క్రీడాకారులు



విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ), సీబీఎస్‌సీ స్కూల్స్ జాతీయ, దక్షిణ భారత అంతర విశ్వ విద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) వద్ద శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు ఎంపికైనట్లు ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో ఎస్.ఏ.అజీజ్ తెలిపారు. డీఎస్ఏ కోచ్ షేక్ ముంతాజ్ బేగం వద్ద ఇందిరాగాంధీ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న జె.సుహాస్‌బాబు, పి.లాస్య ఎస్‌జీఎఫ్ఐ జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టుకు, షేక్ అబ్దుల్ రియాన్ జేఎన్‌టీయుకే జట్టుకు, ఎం.సునీత సీబీఎస్‌సీ స్కూల్ జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారన్నారు. ఈ సందర్భంగా డీఎస్ఏ కార్యాలయం వద్ద క్రీడాకారులను డీఎస్‌డీవో మంగళవారం అభినందించారు. జాతీయ పోటీల్లోనూ రాణించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని క్రీడాకారులకు సూచించారు.

ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన గౌతంరెడ్డి



సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): ఇటీవల ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసులో వైఎస్సార్‌సీపీ నేత పూనూరి గౌతంరెడ్డి మంగళవారం సాయంత్రం ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో నార్త్ జోన్ ఏసీపీ స్రవంతిరాయ్ ఎదుట విచారణకు హాజరయ్యారు. అనంతరం బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో తనపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తప్పుడు కేసు పెట్టారని ఆరోపించారు. అర్ధరాత్రి సమయంలో పోలీసులు అక్రమంగా తన ఇంట్లో చొరబడి తలుపులు పగులకొట్టి దొంగల కంటే ఘోరంగా వ్యవహరించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కూడా ఒక పోలీస్ కమిషనర్ తనను హత్య చేసేందుకు ప్రయత్నించారని, ప్రస్తుతం కూడా తనకు ప్రాణహాని ఉండడంతో హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు దాఖలు చేసినట్లు వెల్లడించారు. పోలీసులకు పూర్తిగా సహకరిస్తానని, వారు ఇచ్చిన నోటీసుపై విచారణకు హాజరయినట్లు తెలిపారు. తిరిగి ఈ నెల 7న మళ్లీ విచారణకు హాజరుకావాల్సిందిగా విచారణ అధికారి కోరటంతో ఆ రోజు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కేసు న్యాయస్థానంలో ఉండటంతో ఇంతకు మించి ఎక్కువ చెప్పలేనన్నారు.

సూత్రా వెడ్డింగ్ స్పెషల్ ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): హోటల్ నోవాటెల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సూత్రా వెడ్డింగ్ స్పెషల్ ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. మెహందీ వేడుక నుంచి గ్రాండ్ రిసెప్షన్ వరకు అవసరమైన వస్త్రాలు, ఉపకరణాలు ఈ సూత్రా ఎగ్జిబిషన్‌లో లభిస్తున్నాయి. వివాహాది శుభకార్యాలకు అవసరమైన అన్నింటిని ఒకే చోటకు తీసుకురావడమే సూత్రా లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా బ్రైడల్ ఆభరణాలు, రీగల్ ఉపకరణాలు, విలాసవంతమైన గృహాలంకరణ వస్తువులు అందించి మధురానుభూతిని కలిగించేలా రూపొందించామని వారు తెలిపారు. దేశం నలుమూలల నుంచి పేరొందిన డిజైనర్లు పాల్గొంటున్న ఈ సూత్రా వెడ్డింగ్ స్పెషల్ ఎగ్జిబిషన్ బుధవారం కూడా ఉంటుందని చెప్పారు. ఎగ్జిబిషన్‌ను సందర్శించి విస్తృత శ్రేణిలో ఏర్పాటు చేసిన కళాత్మకమైన ఆభరణాలు, లెహంగాలు, ఆకర్షణీయమైన చీరలు, టైమ్‌లెస్ షేర్వాణీలు, పాదరక్షలను కొనుగోలు చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు.

అందమైన రహదారి

ఆశయానికి ఆమడ దూరం

నగరంలో 15 ఏళ్ల కిందట సుమారు రూ.150 కోట్ల వ్యయంతో సదాశయంతో నిర్మించిన ఆరు లైన్ల విశాలమైన బీఆర్‌టీఎస్ రహదారి నేడు నిరుపయోగంగా తయారైంది. యాచకులకు ఆవాసంగా మారింది. బైక్ రేసులకు అడ్డాగా తయారైంది. లక్షలాది రూపాయలతో నిర్మించిన బస్టాప్‌లు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్నట్టు తయారైంది బీఆర్‌టీఎస్ రోడ్డు పరిస్థితి.

- నిరుపయోగంగా బీఆర్‌టీఎస్ రహదారి
- రూ.కోట్ల వ్యయం...బూడిదపాలు
- యాచకులకు, అనాథలకు ఆవాసం
- బైక్ రేస్‌లకు అడ్డాగా మారిన వైనం



రాత్రి వేళ మధ్యలో ఖాళీగా ఉన్న లైన్లలో పడుకున్న యాచకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బెజవాడ నగరంలో రోడ్ల పరిస్థితి విచిత్రంగా ఉంది. రద్దీగా ఉండే రోడ్లు ఇరుకుగాను... విశాలంగా ఉన్న రోడ్లు నిరుపయోగంగానూ ఉన్నాయి. ఇందుకు నిదర్శనమే బీఆర్టీఎస్ రోడ్డు. ఈ రోడ్డు ఆశించిన లక్ష్యానికి ఆమడదూరంలో ఉంది. అందంగా నిర్మించిన బస్టాప్‌లు తుప్పు పట్టిపోతున్నాయి. అనాథలు, యాచకులకు కేరాఫ్‌గా మారింది. కొన్ని ప్రాంతాల్లో సమీపంలోని వారు దుస్తులు ఆరేసుకుంటుండగా.. కొంత భాగాన్ని ఫుడ్ కోర్టుకు వినియోగిస్తున్నారు.

ఆరు లైన్ల రహదారి...వృథాగా...

నగరం నడిబొడ్డులో సత్యనారాయణపురం సీతన్నపేట గేటు వద్ద నుంచి గుణదల పడవల రేవు వరకు ఆరు లైన్లతో విశాలమైన రోడ్డు నిర్మించారు. శారదా కళాశాల జంక్షన్, ఫుడ్ జంక్షన్, మధురానగర్ జంక్షన్, పడవల రేవు ప్రాంతాల్లో విశాలమైన బస్టాప్‌లు నిర్మించారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, బందరు రోడ్డు , ఏలూరు రోడ్డులను అనుసంధానిస్తూ బస్సులు నడపాలనే లక్ష్యంతో ఈ విశాలమైన రోడ్డును నిర్మించారు. మొదట్లో కొన్నాళ్లు ఆ విధంగా బస్సులు నడిపారు. ప్రస్తుతం రెండు లైన్లలో మాత్రమే బైక్‌లు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అంతే తప్ప బస్సులు ఎక్కడా నడవడం లేదు. మధ్యలో రెండు లైన్లు యాచకులు, అనాథలకు ఆవాసాలుగా మారాయి. రాత్రి వేళల్లో ఖాళీగా ఉన్న రోడ్లపైనే కొందరు నిద్రిస్తున్నారు. నగరంలో సంచరించే ఆవులు ఈ రోడ్డుపైనే దర్శనమిస్తున్నాయి. దుర్గాపురం నుంచి భానునగర్ పరిసర ప్రాంతాల్లో మధ్యలో రెండు లైన్లను సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. దీనిపై దుస్తులు ఆరేస్తున్నారు. ఖాళీగా ఉండడంతో కొంత భాగంలో ఫుడ్‌కోర్టు నిర్వహిస్తున్నారు.

ఆ జంక్షన్లలో నరకం...

శారదా కళాశాల జంక్షన్ వద్ద రోడ్డుకు ఆనుకుని డ్రైయిన్ పైనే బార్ ఏర్పాటు చేశారు. అక్కడే అతి పెద్ద కళాశాల ఉంది. సత్యనారాయణపురం-గాంధీనగర్ రాకపోకలు సాగించే ప్రధాన జంక్షన్ కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక బార్ వద్ద రాత్రి ఏడు తర్వాత వాహనదారులకు నరకంగా కనిపిస్తోంది. సీతన్నపేట సిగ్నల్‌కు ఆనుకుని తాజాగా ఒక వైన్ షాపు ఏర్పాటు చేశారు. ఈ వైన్ షాపునకు వచ్చే వాళ్లు రోడ్డుపైనే బైక్‌లు నిలిపి ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఒక్కో రోడ్డులో రెండు లైన్లు రద్దీగాను, మరో రెండు లైన్లు పూర్తిగా ఖాళీగానూ ఉండడంతో రోడ్డు ఉద్దేశం నెరవేరలేదు. బీఆర్‌టీఎస్ రోడ్డును పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు ప్రధాన జంక్షన్ల వద్ద ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు..

రోడ్డు విశాలంగా ఉండడంతో బైక్‌లు వాహనాలు వేగంగా వెళుతున్నాయి. రోడ్డులో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ అప్పుడప్పుడు పనిచేస్తున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది ఉన్నప్పటికీ యువత బైక్‌లు గాల్లో లేపుతూ నడుపుతున్నారు. అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇక రేస్‌లు వేసే వారికి కొదవే లేదు. పడవల రేవు వరకు యువత రేస్‌లు నిర్వహిస్తున్నారు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.



రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

శిథిలమైపోతున్న బస్టాప్‌లు

పదిహేనేళ్ల క్రితం నిర్మించిన బస్టాప్‌లు ఒక్కొక్కటి తుప్పు పట్టి దెబ్బతిన్నాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలకు ఇనుప రేకు పాడైపోయింది. రాత్రి వేళల్లో ఆకతాయిలు చేరుతున్నారు. బీఆర్‌టీఎస్‌కు ఆనుకుని వైన్‌షాపులు, బార్‌లు ఉండడంతో ఆయా జంక్షన్ల వద్ద మందుబాబులు హల్ చల్ చేస్తున్నారు. సాయంత్రం అయిందంటే చాలు బస్టాప్‌ల వద్ద గొడవలకు దిగి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. రాత్రి కావడంతో అనాథలు, యాచకులు మధ్యలో ఖాళీగా ఉన్న రెండు లైన్ల మీదకు చేరి అక్కడే నిద్ర పోతున్నారు.



నిరుపయోగంగా ఉన్న మధ్యలోని రెండు లైన్లు

విద్యుత్ చార్జీలు పెంచి... మరో భారం మోపొద్దు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు ప్రభల శ్రీనివాసరావు, ఎంఎస్ నారాయణ

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో జీవనం అస్తవ్యస్తంగా కొనసాగిస్తున్న సామాన్యుడిపై విద్యుత్ చార్జీలు పెంచి మరింత కుంగదీయవద్దని వైఎస్సార్‌సీపీ నగర అధికార ప్రతినిధి ప్రభల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఎంఎస్ నారాయణ అన్నారు. స్థానిక దుర్గాపురంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని, పైగా తగ్గిస్తామంటూ చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేద ప్రజలపై భారం వేసేందుకు సిద్ధమవుతోందని, ఇది ఏమాత్రం సరైంది కాదన్నారు. పేదలను ఆదుకోవాల్సింది పోయి మరింత కుంగదీసేందుకు సిద్ధమవడం విచారకరమని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన ధరలతో ప్రజలు సతమతమవుతుంటే మరోవైపు అకాల వర్షాలతో జన జీవనం మరింత దుర్లభంగా మారిందన్నారు. ఈ సమయంలో ప్రజలను ఉదారంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం మరింత భారం మోపేలా విద్యుత్ చార్జీలను పెంచే దిశగా అడుగులు వేయడం శోచనీయమన్నారు. ఇది ముమ్మాటికీ ప్రజల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న అరాచక చర్యగానే చూడాల్సి వస్తుందన్నారు . విద్యుత్ చార్జీలు పెంచే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే గతంలో మాదిరి విద్యుత్ ఉద్యమం కారణంగా చంద్రబాబు ప్రభుత్వం ఎలా కూలిందో ఇప్పుడూ అదే పరిస్థితి ఉత్పన్నమవుతుందని వారు హెచ్చరించారు.

దాసాంజనేయునికి సింధూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో మంగళవారం సిందూరం, ఆకుపూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి పర్యవేక్షించారు.

చెస్‌లో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన చిరాగ్



చిరాగ్ కొమ్మినేని

లబ్బీపేట(విజయవాడతూర్పు): సింగపూర్‌లో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన 2024 సింగపూర్ నేషనల్ ఏజ్ గ్రూప్ చెస్ చాంపియన్‌షిప్ అండర్ - 14 విభాగంలో నలంద విద్యానికేతన్‌లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థి చిరాగ్ కొమ్మినేని సత్తా చాటాడు. ఆ పోటీల్లో ఫిడే రేటింగ్(1456 సాధించి, దానిలో 9 రౌండ్లకు గాను 4 1/2 పాయింట్లు సాధించి, ఇండియాకు చెందిన అక్షర గోబినాథ్(1441)తో పోటీపడి విజయం సాధించినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. డిసెంబర్ 1న వరల్డ్ చెస్ ఫెడరేషన్(1456) ఈ రేటింగ్‌ను విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా మా శిక్షకుల ఆధ్వర్యంలో విద్యార్థులకు తగిన తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిరాగ్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం హర్షియా బేగం
- ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు అందజేస్తున్న భవిత సిబ్బంది

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం హర్షియా బేగం అన్నారు. సీతన్నపేట లోని ఎస్‌పీఆర్ స్కూల్ ఆవరణలోని భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హర్షియా బేగం మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. 2011 వ సంవత్సరం నుంచి భవిత కేంద్రాల ద్వారా వైకల్యాలు గల పిల్లలకు సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. భవిత కేంద్రాలలో 21 వైకల్యాలకు సంబంధించి శిక్షణ ఇస్తారన్నారు. భవిత కేంద్రం ఐఈఆర్‌టీ జె.కుమార్ మధు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, హోం బేస్డ్, స్టైఫండ్, రీడర్ అలవెన్సులు తల్లుల ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు. ఆడపిల్లలకు రూ.5వేలు, మగ పిల్లలకు రూ.3 వేలు వేసినట్లు తెలిపారు. పిల్లల్లో ఆరు సంవత్సరాల లోపే వైకల్యాలను గుర్తించి తగిన శిక్షణ ఇస్తే వారు త్వరగా మార్పు చెందుతారని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం హాజరైన ప్రత్యేక అవసరాలు గల పిల్లలందరికీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్.పి.ఆర్.ఎం.సి ప్రాథమిక పాఠశాల సీనియర్ ఉపాధ్యాయురాలు డి.అమత మేరి రాణి, పారిశ్రామిక వేత్తలు ఎస్.శేఖర్ రెడ్డి, కె.రాజేష్, కె.శివ ప్రకాష్, భవిత కేంద్రం ఐఈఆర్‌టీ కె. వెంకట సుధ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రభుత్వం అందించే ప్రతి అవకాశాన్ని దివ్యాంగులు అందిపుచ్చుకోవాలని అయితా రాములు నగరపాలకసంస్థ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివన్నారాయణ చెప్పారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని సింగ్‌నగర్‌లోని అయితా రాములు నగరపాలక సంస్థ పాఠశాల ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. తల్లిదండ్రులు వారి పిల్లలు దివ్యాంగులుగా ఉన్నారని బాధపడకూడదన్నారు. పిల్లల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలని చెప్పారు. ప్రపంచంలోనే ఎంతోమంది దివ్యాంగులు చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదిగారని, సివిల్ సర్వీసెస్‌తో పాటుగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఉపాధ్యాయురాలు విజయ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం రవాణా ఖర్చులు, స్కాలర్ షిప్స్, హియరింగ్ మిషన్స్ వంటి ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. వాటిని వినియోగించుకుంటూ చదువుకుని మంచి భవిష్యత్‌ను సొంతం చేసుకోవాలని చెప్పారు. వివిధ పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన పరుగు పందెం, చిత్రలేఖనం, డ్యాన్స్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని అంతర్జాతీయ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జయరామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీపీటీడీ సంస్థలో దివ్యాంగుల ఉద్యోగోన్నతుల విషయమై ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. దివ్యాంగులకు అలవెన్స్‌లు, ఉద్యోగోన్నతులు, హక్కుల సాధనకు జేఏసీ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం అసోసియేషన్ నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ప్రతిభావంతులైన దివ్యాంగులకు అవార్డులను అందజేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొబ్బ సురేష్ రెడ్డి, ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస రాజు, ఏపీడీఈఏ అధ్యక్షుడు గారపాటి సతీష్, ఎన్. మహేష్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తటవర్తి సామాజిక సేవలు వెలకట్టలేనివి



తటవర్తి సూర్యనారాయణ సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న సాహితీ సంస్థల ప్రతినిధులు

విజయవాడకల్చరల్: ప్రముఖ వ్యాపారవేత్త, కళాపోషకుడు తటవర్తి సూర్యనారాయణ సామాజిక సేవలు వెలకట్టలేనివని శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. శ్రీ కళాభారతి, తెలుగు కళావాహినితో పాటు సాంస్కృతిక కళా సమన్వయ వేదిక ఆధ్వర్యంలో తటవర్తి సూర్యనారాయణ సంస్మరణ కార్యక్రమాన్ని మంగళవారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం ధర్మసత్రం వద్ద నిర్వహించారు. శింగంశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తటవర్తి ప్రతి నెలా పేద కళాకారులకు నిత్యావసరాలను అందించేవారన్నారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు మాట్లాడుతూ నగరంలోని అనేక సాంస్కృతిక సంస్థలకు అండదండగా ఉండేవారన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయ రాజు, బి.వీరభద్రరావు, ప్రిన్స్, ఆదిరాజు జయప్రభు, ఎండీ యాకోబ్, మంగపతి తదితరులు పాల్గొన్నారు. తొలుత తటవర్తి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

తటవర్తి మృతి కళారంగానికి తీరనిలోటు



తటవర్తి సంతాప సభలో మాట్లాడుతున్న న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా

విజయవాడకల్చరల్: తటవర్తి సూర్యనారాయణ మృతి కళారంగానికి తీరనిలోటు అని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. కళా సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం తటవర్తి సూర్యనారాయణ సంతాప సభ నిర్వహించారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ సూర్యనారాయణ విలాస్ బనియన్స్ సంస్థ స్థాపించి వందలాది మందికి ఉపాధి కల్పించారని, సామాజిక సేవా రంగంలోనూ ఆయన తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. కళాపోషకుడు గోళ్ళ నారాయణ రావు మాట్లాడుతూ కరోనా సమయంలో కళాకారులకు ఎంతో మేలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కళాసంస్థల ప్రతినిధులు డేవిడ్‌రాజు, చిట్టిబాబు, చింతా వెంకటేశ్వర్లు నరసింహారావు, సింగంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



మాట్లాడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ దివ్యాంగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని మాట్లాడుతూ.. 2015లో ప్రధాని నరేంద్ర మోదీ 'సుగమ్య భారత్' అనే కార్యక్రమం ప్రారంభించి అందులో మొదటి అంశంగా వికలాంగుల పేరును తీసి 'దివ్యాంగులుగా' మార్చి వారికి గౌరవం కల్పించారన్నారు. దేశ వ్యాప్తంగా 90 విమానాశ్రయాలు, 700 రైల్వే స్టేషన్లను దివ్యాంగులకు అనుకూలంగా సౌకర్యాలను మెరుగుపర్చామని, దివ్యాంగుల సౌకర్యాల కోసం 1.10 కోట్లకు పైగా యూడీఐడీ కార్డులను ఇచ్చామని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ పారా క్రీడాకారుడు సుబ్బయ్య తిరుమలై కుమార్‌ను డీఆర్ఎం సత్కరించారు. డివిజన్‌లో కూడా పారా క్రీడలను ప్రోత్సహించాలని, అన్ని రైల్వే స్టేడియాల్లో పారా క్రీడలకు అనువైన సౌకర్యాలను కల్పిస్తామని ఆయన చెప్పారు. దివ్యాంగ ఉద్యోగులకు మోటార్ ట్రై సైకిళ్లు కొనుగోలుకు ఎస్‌బీఎఫ్ ఫండ్స్ ద్వారా రూ.25 వేలు, ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ద్వారా రూ.10 వేలు అందిస్తామన్నారు. వీటితో పాటుగా అవసరమైతే బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం ఏర్పాటు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.శ్రీనివాసరావు, సీఎంఎస్ డాక్టర్ సౌరిబాల, దివ్యాంగుల అసోసియేషన్ డివిజనల్ చైర్మన్ రామకృష్ణ, సెక్రటరీ శివకుమార్, ట్రెజరర్ జగదీశ్వరరావు, ఎర్రంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పచ్చబడ్డీలు వెలిశాయి!



బీఆర్‌టీఎస్ రోడ్డు మధురానగర్ వంతెన వద్ద వెలిసిన పచ్చబడ్డీ

బతుకు తెరువు కోసం సామాన్యులు ఎవరైనా రోడ్డు పక్క ఓ బడ్డీ కొట్టు పెట్టుకుంటే అధికారులు వచ్చి ఆక్రమణల పేరిట తొలగించేస్తారు. అయితే బడ్డీలు నిక్షేపంగా ఉండాలంటే దానికి ఒకటే ఉపాయం...ఆ బడ్డీకి పసుపు రంగు పూయడమే... పచ్చ బడ్డీ జోలికి రావడానికి అధికారులకు ధైర్యం చాలదు. ఇక ఎంచక్కా పర్మనెంట్‌గా షెడ్డు కూడా నిర్మించుకున్నా అడిగేవాడు ఉండడు. బీఆర్‌టీఎస్ రోడ్డు మధురానగర్ వంతెన సమీపంలో ఇటీవల ఆక్రమణల పేరిట తొలగించిన దుకాణాల ప్రాంతంలో పచ్చబడ్డీలు వెలిశాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పచ్చబడ్డీలను ఏర్పాటు చేయటంతో పాటు షెడ్డులు కూడా వేయటం గమనార్హం. ఆక్రమణల పేరిట నిరుపేదలు నిర్వహించుకునే చిన్నపాటి బడ్డీలను సైతం తొలగించిన అధికారులు ఇప్పుడు ఇక్కడ షెడ్డు వేసినా పట్టించుకోకపోవటం అనుమానాలకు తావిస్తోంది. ఈ దుకాణాల వద్ద తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన షెడ్డులను, దుకాణాలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

– మధురానగర్(విజయవాడసెంట్రల్)